క్లుప్తంగా

రేపు 'కంటి వెలుగు'పై సమావేశం

షాద్‌నగర్‌రూరల్‌: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమానికి సంబంధించిన ప్రత్యేక సమావేశం రేపు (సోమవారం) పట్టణంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు శనివారం ఎంపీడీఓ వినయ్‌కుమార్ తెలిపారు. ఎంపీపీ ఖాజా ఇద్రీస్ అహ్మద్ అధ్యక్షతన ఉదయం 11గంటలకు నిర్వహించే సమావేశానికి సర్పంచులు, ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు విధిగా హాజరు కావాలని కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

షాద్‌నగర్‌రూరల్‌: సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కును శనివారం ఎంపీటీసీ లావణ్య లబ్ధిదారుడికి అందజేశారు. మండల పరిధిలోని వెలిజర్ల గ్రామానికి చెందిన కావలి జంగయ్య గత కొంత కాలం క్రితం అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆర్థిక సహాయం కోసం సీఎం సహాయ నిధి కింద దరఖాస్తు చేసుకోగా రూ.49వేలు మంజూరైంది. ఈ చెక్కును గ్రామ ఎంపీటీసీ సభ్యురాలు లావణ్య లబ్ధిదారుడు కావలి జంగయ్యకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు అశోక్‌రెడ్డి, రవీందర్, రవి, శివరాజ్‌గౌడ్, రామదాసు, పాల్గొన్నారు.

బాలుడు అదృశ్యం


సల్మాన్

షాబాద్‌: ఓ బాలుడు అదృశ్యమైన ఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. షాబాద్ సీఐ గురువయ్యగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం...మండలంలోని అప్పారెడ్డిగూడ గ్రామానికి చెందిన ఏండీ హుస్సేన్ కుమారుడు ఏండీ సల్మాన్(9) ఈ నెల 5వ తేదీ రాత్రి 7గంటల నుంచి కనిపించడం లేదు. బంధువుల వద్ద, చుట్టుపక్కల వెతికినా బాలుడు ఆ చూకీ లభించలేదు. దీంతో బాలుడి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. బాలుడి ఆచూకి తెలిసిన వారు షాబాద్ పోలీస్ స్టేషన్ నంబర్ 9440827257,8712889450కి సమాచారం అందించాలని సీఐ తెలిపారు.

బీసీలకు రిజర్వేషన్లు పెంచాలి

బీఎస్పీ నాయకుడు శ్రీనివాస్


సంతకాల సేకరణలో పాల్గొన్న నాయకులు

షాద్‌నగర్‌టౌన్‌: జనాభా ప్రాతిపదికన ప్రభుత్వం బీసీలకు రిజర్వేషన్లు పెంచాలని బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీఎస్పీ నేతలు సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దొడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రభుత్వాలు బీసీలకు రిజర్వేషన్ పెంచకపోవడంతో వారు ఎంతో నష్టపోతున్నారని అన్నారు. జనాభా ప్రాతిపదికన బీసీలకు 27శాతం నుంచి 50 శాతం రిజర్వేషన్ పెంచాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మల్లేష్‌యాదవ్, గోపన్న, భీమయ్య, కుమార్, అనంతయ్య, హరికుమార్, మల్లేష్ సలావుద్దీన్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

ఎంపీపీ నక్షత్రం, జెడ్పీటీసీ శ్రీకాంత్


రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

మొయినాబాద్‌: రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తోందని ఎంపీపీ గునుగుర్తి నక్షత్రం, జెడ్పీటీసీ కాలె శ్రీకాంత్‌లు అన్నారు. మొయినాబాద్ గ్రామ పంచాయతీలో శనివారం రూ.20లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను ఎంపీటీసీ పద్మమ, ఉప సర్పంచ్ రాజేశ్‌గౌడ్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో మౌలిక వసతుల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, తదితర సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులతో పూర్తి చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కావాల్సిన నిధులను ఎప్పటికప్పుడు విడుదల చేస్తోందన్నారు. గ్రామాల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎఎంసీ వైస్ చైర్మన్ ఎంఏ రావూఫ్, ఎంపీటీసీలు మల్లేశ్, అర్జున్, కార్యదర్శి సుదర్శన్, ఏఈ గోపాల్, వార్డు సభ్యులు షేక్‌మహబూబ్, సరేందర్‌గౌడ్, శ్రీనివాస్, ఉమ్మర్ ఉన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

షాబాద్‌: 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు హైదరాబాద్‌లో జరిగే టీయూడబ్ల్యూజే 149 రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సంఘం చేవెళ్ల నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి దర్శనాల కృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఈ మహాసభలకు చేవెళ్ల నియోజకవర్గం నుంచి జర్నలిస్టులందరూ పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

విద్యుత్ కోత.. రైతుకు వెత!


షాబాద్‌లో ముదురుతున్న వరినారు


షాబాద్‌లో కరిగ్లేట్లు చేస్తున్న రైతులు

- 24 గంటలు రావడం లేదంటున్న రైతులు
- వచ్చే 12 గంటల్లో ఎల్‌సీ పేరుతో కోత
- యాసంగి సాగుపై రైతుల ఆందోళన

షాబాద్‌: కరెంట్ కోతలతో యాసంగిపై ప్రభావం పడుతోంది. సాగుకు 12 గంటల విద్యుత్ సరఫరా చేస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. యాసంగిలో పూర్తిగా బోరు బావులపైనే ఆధారపడి సాగుచేసే రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 24 గంటల విద్యుత్‌కు అలవాటు పడిన రైతులు 12 గంటలకు విద్యుత్ సరఫరాను కుదించడంతో పారిన మడులే మళ్లీ పారుతున్నాయి. కిందికి నీళ్లు వెళ్లడం లేదని, దీంతో నాట్లు అలస్యం అవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- సాగుకు 24 గంటల ఉచిత విద్యుత్ కావడంతో చిన్న, సన్నకారు రైతులు కూడా బోర్లు వేసి వ్యవసాయం చేస్తున్నారు. పైగా ఆరుతడి పంటలు వేస్తే సాగు, మద్దతు ధర, కూలీల కొరత ఉండడంతో సులభంగా పండే వరివైపే రైతులు మొగ్గు చూపుతున్నారు. వరికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వడం..ఊరూరా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర కల్పించడమే కాకుండా నగదు కూడా నేరుగా రైతు బ్యాంక్ ఖాతాలో సకాలంలో జమ చేస్తుండడంతో రైతులు ఎక్కువగా వరిసాగు చేస్తున్నారు.
- వరి సాగు చేయడానికి ఎక్కువ నీరు అవసరమవుతుంది. ప్రస్తుతం నాట్లు వేయడానికి రైతులు సిద్ధంగా ఉన్నారు. నీటి సరఫరా కూడా మడుల మీదుగా రైతుల ప్రమేయం లేకుండా వాటంతటఅవే పారడంతో రైతులు వరి సాగు చేస్తున్నారు. ట్రాక్టర్‌తో దమ్ముచేయడం, కూలీలు, హార్వెస్టర్ యంత్రాల కోతలతో ఎక్కువ కష్టం లేకుండా వరి పంటను సులభంగా పండిస్తున్నారు. పైగా వరికి అడవి పందుల బెడద కూడా ఉండదు.

యాసంగిలో 80 శాతం వరిసాగు ...

- వ్యవసాయ శాఖ లెక్కల ప్రకారం యాసంగి సాగుకు సంబంధించి జిల్లాలో 70 వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలు వేస్తున్నారు. ఇందులో 30 శాతం వరి వేయడానికి రైతులు సిద్ధమయ్యారు. ఈ సారి వర్షాలు సమృద్ధిగా కురవడంతో భూగర్భజలాలు పెరిగాయి. దీంతో బోరు బావుల కింద, చెరువులు, కుంటల కింద పంటలు పండిస్తున్నారు.
- విద్యుత్ సరఫరా అధికారికంగా పగలు, రాత్రి 15 గంటలని ప్రభుత్వం చెబుతున్నా వారం రోజుల నుంచి కేవలం పగలు మాత్రమే 12 గంటల పాటు సాగుకు విద్యుత్‌ను సరఫరా చేస్తున్నారు. ఇందులో కూడా రెండు, మూడు గంటలు వివిధ మరమ్మతుల పేరుతో కోతలు విధించడంతో 10గంటల విద్యుత్ మాత్రమే సరఫరా అవుతుందని రైతులు చెబుతున్నారు. దీంతో యాసంగి సాగుపై తీవ్ర ప్రభావం పడుతుందని రైతులు వాపోతున్నారు.

నార్లు ముదురుతున్నాయి



సాగుకు 24 గంటల విద్యుత్ సరఫరాను 10,12 గంటలే ఇస్తున్నారు. దీంతో తడిసిన మడులే తడుస్తున్నాయి. ఫలితంగా నాట్లు ఆలస్యమై వరి నారు ముదురుతోంది. ముదిరిన నారుతో నాటు వేస్తే దిగుబడిపై ప్రభావం పడుతుంది.

– సత్యనారాయణ, రైతు నరెడ్లగూడ

24 గంటలు ఇవ్వడం లేదు



ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురిశాయి. బోరు బావుల కిందే సాగు ఎక్కువగా ఉంది. అనుకున్న ప్రకారం కరెంట్ వస్తలేదు. ఒక మడి తడిసి మరో మడికి నీరు పారిద్దామంటే కరెంట్ పోతోంది. తడిసిన మడే మళ్లీ తడుస్తోంది.

– బంట్టు కిష్టయ్య, రైతు లక్ష్మరావుగూడ

దమ్ము చేయడానికి నీళ్లు లేవు



విద్యుత్ సరఫరాలో కోతలు విధించడం వల్ల ట్రాక్టర్‌తో పొలంలో సక్రమంగా దమ్ము చేయలేపోతున్నాం. నీరు పారకపోవడంతో పొద్దంతా ట్రాక్టర్లకు పని దొరకడం లేదు. కొట్టిన మడులనే మళ్లీమళ్లీ దమ్ము కొట్టాల్సి వస్తోంది.

– మహేందర్‌రెడ్డి, రైతు పోలారం

ఉద్యమకారుల చరిత్ర ప్రజలకు తెలియాలి

విద్యాశాఖమంత్రి పట్లోళ్ల సబితారెడ్డి


ఇంద్రారెడ్డి చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సబితారెడ్డి

చేవెళ్ల: తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కోసం ఎంతో మంది మహనీయులు ఎన్నో ఉద్యమాల చేశారని వారి త్యాగాలు, చరిత్ర ప్రజలకు తెలియాలని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. నగరంలోని మంత్రి నివాసం వద్ద శనివారం ఉస్మానియా యూనివర్సిటీ పరిశోధక విద్యార్థి, రాష్ట్ర బీఆర్‌ఎస్వీ కార్యదర్శి చటారి దశరథ్ ప్రింట్ చేయించిన స్వర్గీయ మాజీ హోంశాఖ మంత్రి పట్లోళ్ల ఇంద్రారెడ్డి చరిత్ర పుస్తకాలను మంత్రి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుస్తకాలను ఆవిష్కరించిన సబితారెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కావాలని ఆకాంక్షించిన వారిలో స్వర్గీయ ఇంద్రారెడ్డి ఒక్కరని ఆయన ఏకంగా తెలంగాణ కోసం మొదట ఉద్యమాన్ని నడిపించారన్నారు. తెలంగాణ కోసం ఎంతో మంది మహనీయులు పోరాటాలు చేశారని అలాంటి వారి చరిత్ర ప్రజలకు తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. భవిష్యత్తు తరాలకు ఉద్యమకారుల చరిత్ర తెలుసుకునేలా పుస్తకాలు ప్రింట్ చేయడంటం ఎంతో సంతోషకరమని అన్నారు. చటారి దశరథ్‌ను ఆమె అభినందించారు. దశరథ్ మాట్లాడుతూ.. చేవెళ్ల ప్రాంతంలోని పాఠశాలల్లో ఈ చరిత్ర పుస్తకాలను పంచడం జరుగుతుందని తెలిపారు. ఈప్రాంతంలోని నాయకుడి గురించి ఈ ప్రాంత ప్రజలకు ముఖ్యంగా భవిష్యత్తు తరాలకు తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉంటుందని అందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు, తదితరులు ఉన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

ఎమ్మెల్యే అంజయ్యయాదవ్


టోర్నమెంట్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కొందుర్గు: క్రీడలతో శారీరక ధృడత్వంతో పాటు మానసికోల్లాసాన్ని పెంపొందిస్తాయని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఫ్రెండ్స్ యూత్ అసొసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 16వ రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఫ్రెండ్స్‌యూత్ అసొసియేషన్ సభ్యులు గత 15 ఏళ్లుగా కొందుర్గులో నిర్వహిస్తున్న టోర్నమెంట్‌కు చుట్టుపక్కల ప్రాంతాల క్రీడాకారులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి క్రీడాకారులు హాజరై తమ ప్రతిభను చూపుతున్నారన్నారు. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవడం అభినందనీయమన్నారు. టోర్నమెంట్‌కు హాజరయ్యే క్రీడాకారులు సంయమనం పాటించి టోర్నమెంట్ విజయవంతం చేయడానికి సహకరించాలని సూచించారు. ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించడం కోసం ప్రతి గ్రామంలో క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేసిందన్నారు. ఇక్కడ ఉన్న క్రీడా మైదానాన్ని క్రీడాకారులు వినియోగించుకోవాలని సూచించారు.

జాతీయ క్రీడల్లో రాణించాలి.. మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి

క్రీడాకారులు క్రీడల్లో తమ ప్రతిభను చాటి జాతీయ స్థాయి క్రీడల్లో రాణించాలని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి ఆకాంక్షించారు. ఇలాంటి టోర్నమెంట్లు నిర్వహించడం వల్లనే గ్రామీణ క్రీడాకారుల్లో దాగి ఉన్న నైపుణ్యం బయటికి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆంజనేయులు, వైస్ ఎంపీపీ రాజేష్‌పటేల్, పీఏసీఎస్ చైర్మన్ దామోదర్‌రెడ్డి, ఉప సర్పంచ్ రాజారమేష్ రెడ్డి, టీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, నాయకులు కావలి యాదయ్య, రామకృష్ణ, పీఈటీలు పాల్గొన్నారు.

తోటి ఉపాధ్యాయుడిగా ఎదిగి..

గురువుకు పూర్వ విద్యార్థి పాదాభివందనం


గురువుకు పాదాభివందనం చేసి సన్మానం చేస్తున్న ఉపాధ్యాయుడు

మొయినాబాద్‌రూరల్‌: విద్యార్థి దశలో క్రమశిక్షణతో ఎదిగి విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయుడి పాఠశాలలోనే ఉపాధ్యాయుడిగా ఉద్యోగం పొందడం తనకు ఎంతో సంతోషంగా ఉందని అజీజ్‌నగర్ ప్రాథమిక పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు రాములు అన్నారు. శనివారం మండల పరిధిలోని అజీజ్‌నగర్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థి ఉపాధ్యాయుడిగా విద్యాబుద్ధులు నేర్పిస్తు పక్కనే ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉద్యోగం చేస్తున్న రాములు తన గురువుకు సన్మాన సభను నిర్వహించారు. చేవెళ్ల నియోజకవర్గంలోని ఆలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అప్పట్లో తెలుగు పండితుడిగా ఉపాధ్యాయుడు పెంటయ్య విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించారు. ఆనాటి క్రమశిక్షణ, విద్యాబుద్ధులే ఆ పాఠశాలలో చదివిన విద్యార్థి ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయుడిగా అజీజ్‌నగర్ జిల్లా పరిషత్ పాఠశాలలో తెలుగు పండితుడిగా కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా పూర్వ ఉపాధ్యాయుడు పెంటయ్యను సన్మానించి కన్నీళ్లు పెట్టుకున్నారు. ఉపాధ్యాయులు నేర్పించే విద్యాబుద్ధులు ఎంతో మంచివని క్రమశిక్షణ అలవర్చుకున్నప్పుడే భవిష్యత్తుకు బంగారు బాటలు ఉంటాయని సూచించారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్సింహ్మనాయక్, శోభారాణి, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.


పేదల రాజ్యం నిర్మాణమే బీజేపీ ధ్యేయం

షాద్‌నగర్ నియోజకవర్గ పాలక్ బాలకృష్ణారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న బాలకృష్ణారెడ్డి

షాద్‌నగర్‌: రాష్ట్రంలో పేదల రాజ్యం నిర్మాణమే బీజేపీ లక్ష్యమని నియోజకవర్గ పాలక్ జిట్టా బాలకృష్ణారెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని కుంట్లరాం రెడ్డి గార్డెన్‌లో బీజేపీ మహా సమ్మేళన వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ... వచ్చే ఆరు నెలల్లో తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు జరిగే అవకాశం ఉందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని చెప్పారు. బీజేపీ అధికారంలోకి రావాలంటే పోలింగ్ బూత్ సభ్యులు కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. సరళ్ యాప్ ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాలను, పార్టీ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తుందని తెలిపారు. రాని నిధుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం వాస్తవాలను కప్పిపుచ్చుతుందని విమర్శించారు. కేంద్రం ఇచ్చిన నిధులపై బీఆర్‌ఎస్ నేతలు దమ్ముంటే చర్చకు రావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఉద్యోగాల భర్తీ కోసం బీజేపీ ప్రభుత్వం నోటిఫికేషన్లు జారీ చేస్తుంటే సీఎం కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులు తప్పుడు ప్రచారం చేస్తుందన్నారు. స్మార్ట్‌సిటీ, ఉపాధి హామీ, గ్రామపంచాయతీల్లో హరితహారం కోసం కేంద్రం నిధులు మంజూరు చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం నిధులను దారి మళ్లిస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో శివరాజ్, భూపాలాచారి, మిథున్‌రెడ్డి, వెంకటేష్‌గుప్త, విజయ్ కుమార్, కృష్ణారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, నర్సింహ్మ, వెంకటేశ్వర్‌రెడ్డి, మాణిక్యం పాల్గొన్నారు.

ముదిరాజ్ భవన్‌కు స్థలం కేటాయించండి


ఎమ్మెల్సీ ప్రకాష్‌కు వినతి పత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

షాద్‌నగర్‌: పట్టణంలో ముదిరాజ్ భవన్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరుతూ.. శనివారం ముదిరాజ్ మహాసభ తాలుక అధ్యక్షుడు అంచరాములుతో పాటుగా పలువురు నాయకులు ఎమ్మెల్సీ బండ ప్రకాష్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో నాయకులు వెంకటేష్, అంతయ్య, శంకర్, శ్రీశైలం, యాదగిరి, మధు తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీల ఎన్నిక

షాద్‌నగర్ మున్సిపాలిటీ ముదిరాజ్ సంఘం నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం మున్సిపాలిటీ కన్వీనర్‌గా శ్రీధర్, కోకన్వీనర్‌గా చెవ్వుల రవి, యువజన విభాగం కన్వీనర్‌లుగా భాస్కర్, హరీష్, అలాగే వివిధ వార్డు కమిటీలకు అధ్యక్షులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నర్సింహ్మ, శ్రీశైలం, వెంకటేష్, జంగయ్య, శివ, యాదయ్య, రమేష్, రవి, రమేష్ పాల్గొన్నారు.

ఆంగ్లభాషతో భవిష్యత్తు..

ఎంఈఓ వెంకటయ్య

మొయినాబాద్‌: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఆంగ్లభాషపై పట్టు సాధిస్తే భవిష్యత్తులో రాణిస్తారని ఎంఈఓ వెంకటయ్య అన్నారు. మండల పరిధిలోని పెద్ద మంగళారం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థుల ఆంగ్ల భాషలో పదజాలు, కథల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఈఓ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ఆంగ్ల భాష బోధనకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపిస్తోందని చెప్పారు. విద్యార్థులకు బోధిస్తున్న ఆంగ్ల భాషను విద్యార్థులు బాగా అర్థం చేసుకొని నేర్చుకునేందుకు ఇలాంటి పోటీల ద్వారా ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. ఆంగ్లభాష నేర్చుకోవడం వల్ల విద్యార్థులకు భవిష్యత్తులో మంచి ఉపాధి అవకాశాలు ఉంటాయని కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఎదుగుతారని చెప్పారు. ఆంగ్ల చదవడం, రాయడం, మాట్లాడడం నేర్చుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికల్లో బీజేపీదే గెలుపు

మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

శంకర్‌పల్లి: రాబోయే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని మణిగార్డెన్‌లో చేవెళ్ల అసెంబ్లీ బూత్ సమ్మేళన సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన విచ్చేసి అసెంబ్లీ పరిధిలోని మండల నాయకులతో కార్యకర్తలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. సీఎం కేసీఆర్ చేపడుతున్న ప్రజా వ్యతిరేఖ పాలనపై ఉద్యమించాలని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాష్, చేవెళ్ల అసెంబ్లీ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, సీనియర్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, చేవెళ్ల, మొయినాబాద్ మండలాల అధ్యక్షుడు పాండురంగారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శంకర్‌పల్లి మున్సిపల్ అధ్యక్షుడు సురేష్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి రాజేందర్‌సింగ్, బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి లింగంయాదవ్ పాల్గొన్నారు.

కమ్మేసిన పొగమంచు


షాబాద్‌లో కురుస్తున్న పొగ మంచు

అసలే చలికాలం.. శనివారం ఉదయం విపరీతంగా మంచు కురవడంతో షాబాద్ మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో పొగమంచు కమ్మేసింది. మంచు మబ్బులు దారులను కప్పివేశాయి. దీంతో జాతీయ రహదారిపై ఉదయం 8 గంటలు దాటిన పొగమంచుతో ముందు వెళ్లే వాహనాలు కనిపించకపోవడంతో వాహనదారులు లైట్ల వెలుతురుతో వెళ్లారు. ఉదయం 8 గంటలు దాటిన గ్రామాలు మంచు దుప్పటిలో ముసుగు వేసినట్లు కనిపించాయి. – షాబాద్

ప్రజా సంక్షేమమే బీఆర్‌ఎస్ లక్ష్యం

ఎంపీపీ రవీందర్‌యాదవ్


ఆసరా పింఛన్ కార్డును అందజేస్తున్న ఎంపీపీ

కేశంపేట: ప్రజా సంక్షేమం బీఆర్‌ఎస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని ఎంపీపీ ఎల్గనమోని రవీందర్‌యాదవ్ అన్నారు. మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురికి ఇటీవల మంజూరైన ఆసరా పింఛన్ల పంపిణీ మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్‌యాదవ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఎప్పుడు లేని విధంగా సబ్బండ వర్గాల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికి స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తుందన్నారు. మిషన్ కాకతీయ పథకంతో చెరువులను సుందరీకరంచడం వల్ల నేడు ప్రతి చెరువు నీటితో కళకళలాడుతుందని చెప్పారు. వృద్ధులకు, వికలాంగులకే కాకుండా బీడీ కార్మికులకు, చేనేత కార్మికులకు, ఒంటరి మహిళలకు పింఛన్లను బీఆర్‌ఎస్ ప్రభుత్వం అందిస్తుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో కేశంపేట, కొత్తపేట గ్రామాల సర్పంచులు వెంకట్‌రెడ్డి, నవీన్‌కుమార్, షాద్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణగౌడ్, కొత్తపేట ఎంపీటీసీ మల్లేష్ యాదవ్, మండల కోఆప్షన్ సభ్యులు జమాల్‌ఖాన్, ఇన్‌చార్జి ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, పర్వాత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దాతల సహాయం మరువలేనిది


స్టేషనరీ వస్తువులు పంపిణీ చేస్తున్న సభ్యులు

ఎంపీటీసీ పట్నం రాంరెడ్డి

మొయినాబాద్‌: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతల అందించే సహాయం మరువలేనిదని ఎంపీటీసీ పట్నం రాంరెడ్డి అన్నారు. మండలంలోని శ్రీరాంనగర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం రిసోర్స్ సొల్యూషన్స్ కంపెనీ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్టేషనరీ పెన్నులు, నోట్‌పుస్తకాలు, పెన్సీలు, వాటర్ బాటిల్స్, జామెట్రి బాక్సులు బావేశ్ కటారీ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాంరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు స్వచ్ఛంద సంస్థల సభ్యులు ముందుకు వచ్చి స్టడి మెటీరియల్స్ అందించడం అభినందనీయమన్నారు. దాతలు సహకారంతో ప్రభుత్వ పాఠశాలలు ఎంతో బలోపేతం అవుతాయని చెప్పారు. విద్యార్థుల అభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు.కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జంగయ్య, ఉపాధ్యాయులు అలివేలు, ప్రవీణ్‌కుమార్, సంస్థ ప్రతినిధులు గిరీశక్రహికా, మాలిక, ప్రేమ్‌చంద్, సందపీ, వార్డు సభ్యులు యాదయ్య, సుధాకర్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, అశోక్, నాయకులు, శివశంకర్, విద్యార్థులు ఉన్నారు.